క్లుప్తంగా

సన్మానం



ములుగు రూరల్: మల్లంపల్లి మండలంలోని రాంచంద్రాపూర్‌లో దుర్గామాత ఆలయలంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భాదం ప్రవీణ్‌కుమార్‌ను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించి మెమోంటో అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ నర్సింగరావుకు..



ఏటూరునాగారం: సెర్ప్‌లో సీసీగా పనిచేసిన నర్సింగరావును మహిళా గ్రూపు సభ్యులు ఐకేపీ కార్యాలయంలో సోమవారం సన్మానించారు. అనంతరం నూతన సీసీగా వచ్చిన వెలుపుల సమ్మక్కకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామాఖ్య సంఘం సభ్యులు సామ అలివేలు, చాట్ల పుష్పలత, రేగ నర్సక్క, ఎస్‌కే మెహర్నిషా, పూనెం ప్రమీల, సోమారావు స్వరూప, ఎట్టి రమాదేవి పాల్గొన్నారు.

పరామర్శ

ములుగు రూరల్: మల్లంపల్లి మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన అజ్మీర జగ్గు, గడ్డం రవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క సోమవారం పరామర్శించారు. ఆమె వెంట గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్, గొల్లపల్లి రాజేందర్, నాయకులు ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



చిట్యాల: మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి(సీ) గ్రామానికి చెందిన చిలుక రాకేశ్ సెల్‌ఫోన్ ఆరు నెలల క్రితం పోగొట్టుకున్నాడు. ఈమేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై శ్రావన్ కుమార్ ఆదేశాల మేరకు కానిస్టేబుల్ లాల్‌సింగ్ సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించారు. దీంతో బాధితుడికి ఎస్సై సోమవారం సెల్‌ఫోన్‌ను అందజేశారు.

బాధ్యతల స్వీకరణ



కాటారం: కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయం డీఏఓగా మోతిసింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన డీఏఓగా బాధ్యతలు స్వీకరించిన మోతిసింగ్‌ను సబ్ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు నాగరాజు, రామారావు, శ్రీనివాస్, అనిల్, కాటారం డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్, ఆర్ఐ భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

పారదర్శకతే లక్ష్యంగా..

- ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై జాగ్రత్తలు
- పీఎం ఆవాస్ యోజన యాప్‌తో రీసర్వే, జియో ట్యాగింగ్
- క్షేత్రస్థాయిలో వివరాల నమోదు

గోవిందరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాలనే ఆశయంతో ఈ పథకం ప్రారంభమైనప్పటికీ, లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో నిజమైన పేదలకు న్యాయం చేసేందుకు, పథకం లక్ష్యం నీరు గారకుండా చూసేందుకు చర్యలు చేపట్టారు. గతంలో ఆమోదించిన ఎల్1 జాబితాలను క్షుణ్ణంగా పునర్‌పరిశీలిస్తున్న ప్రక్రియను ముమ్మరం చేశారు. నిజమైన లబ్ధిదారులకే ప్రయోజనం అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరుగుతోంది.

క్షేత్రస్థాయిలో రిసర్వే..

ప్రభుత్వం జిల్లాలోని 10 మండలాల పరిధిలో 4601 ఇళ్లను మంజూరు చేయగా వివిధ దశల్లో ఇంటి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా గ్రామ సభల ఆమోదంతో సిద్ధం చేసిన ఎల్1 జాబితాలపై మరోసారి కేంద్ర ప్రభుత్వం సర్వే చేపట్టింది. రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఇతర శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ప్రతీ లబ్ధిదారుడి ఇంటిని క్షేత్రస్థాయిలో సందర్శించి రిసర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేలో భాగంగా లబ్ధిదారుడి ఆర్థిక స్థితిగతులు, కుటుంబ సభ్యుల వివరాలు, ఆదాయ మార్గాలు, వారి పేరు మీద ఉన్న స్థిర, చరాస్తులను కూడా ఆరా తీస్తున్నారు. ఆపై గ్రామ సభల ముందు, ఆన్‌లైన్‌లో జాబితా పొందుపరిచి ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేసేందుకు అవకాశం కల్పిస్తారు.



లబ్ధిదారుల వివరాలు నమోదు చేస్తున్న అధికారులు(ఫైల్)

సాంకేతికతను వినియోగిస్తూ..

ఎంపిక ప్రక్రియలో పారదర్శకత తీసుకొచ్చేందుకు అధికారులు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పీఎం ఆవాస్ యోజన యాప్ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ యాప్‌తో ప్రతి దరఖాస్తుడి ఐరీస్, ఇంటిని లేదా వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రదేశాన్ని జియో ట్యాగింగ్‌తో సహా ఫొటోలు తీసి అప్లోడ్ చేస్తున్నారు. అంతేకాకుండా ఆధార్ నంబర్, బ్యాంక్ ఖాతా, ఉపాధిహామీ కూలీ అయితే జాబ్ కార్డు వివరాలు కూడా నమోదు చేస్తున్నారు. దీని ద్వారా లబ్ధిదారుడి వాస్తవ నివాస పరిస్థితి స్పష్టంగా రికార్డువుతోంది. గతంలో కొందరు పాత గుడిసెలను, అద్దె ఇళ్లను చూపించి పథకానికి దరఖాస్తు చేసుకున్న సందర్భాలు ఉఆన్నయి. కానీ జియో ట్యాగింగ్‌తో లొకేషన్ కచ్చితంగా నిర్ధారించడం వల్ల ఇలాంటి మోసాలకు పూర్తిగా అడ్డుకట్ట పడుతోంది.

ఆశతో ఎదురుచూస్తున్నాం..



కూలీ పని చేసుకోని బతికే మాకు సొంత ఇల్లు అనేది జీవితకాలపు కల. తొలి విడతలో మాకు ఇల్లు మంజూరు కాలేదు. ఈ సారైనా ఇల్లు వస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నాం. ఇప్పుడు అధికారులు మళ్లీ ఇంటింటికీ వచ్చి విచారణ చేస్తుంటే మాలో కాస్త ఆశ మొదలైంది.

– కొమ్మరాజుల ఎల్లయ్య, చల్వాయి

పారదర్శకంగా ఎంపిక



ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వేను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నాం. టెక్నాలజీతో జియో ట్యాగింగ్ యాప్‌తో వాస్తవ పరిస్థితిని నేరుగా రికార్డు చేస్తున్నాం.

– మమత, ఎంపీడీఓ, గోవిందరావుపేట

‘రెడ్డి గాండ్ల’ను బీసీలుగా గుర్తించొద్దు



భూపాలపల్లి రూరల్: కలెక్టర్ రాహుల్‌శర్మకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్/కాళేశ్వరం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన రెడ్డి గాండ్ల కులస్తులను బీసీలుగా గుర్తించొద్దని కలెక్టర్ రాహుల్‌శర్మ, మహదేవపూర్ తహసీల్దార్ రామారావులకు బీసీ సంఘాల నాయకులు వేర్వేరుగా కలిసి సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం కాటారం డివిజన్ అధ్యక్షుడు మైనర్ బాబు, గౌరవ అధ్యక్షుడు నిడిగొండ సత్యనారాయణ మాట్లాడుతూ.. బీసీ సర్టిఫికెట్లు రద్దు చేసి ఆ కులస్తుల బీసీలు కాదని అనర్హులుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక అధ్యక్షుడు సముద్రాల తిరుపతి, బీసీ కుల సంఘాల నాయకులు గడ్డం స్వామి, తడకల జగదీశ్వర్, తన్నీరు రాఘవేంద్ర, అడప మల్లయ్య, గుజ్జేటి శ్రీనివాస్, కడార్ల రాజబాపు, దాగం సంతోష్, రెబ్బ ప్రదీప్, తిప్పరి రవి, చెన్నూరి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



కాటారం: వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కాటారం: బీసీ సమాజానికి తీరని అన్యాయం చేస్తున్న రెడ్డిగాండ్ల కులస్తులను బీసీలుగా గుర్తించొద్దని కోరుతూ అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం నాయకులు తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని చింతకాని గ్రామంలో మాత్రమే దశాబ్దాలుగా గాండ్ల కులస్తులం నివాసం ఉంటున్నామని ఏ గ్రామంలో గాండ్ల కులస్తులు లేరని అన్నారు. ఈ ప్రాంతంలోని రెడ్డిగాండ్ల కులస్తులు బీసీలుగా చెలామణి అవుతున్నారని ఆరోపించారు. సమాజంలో రెడ్డిగా గౌరవం పొందుతూ ఉద్యోగ, విద్య, ఉపాధి, రాజకీయపరంగా బీసీలుగా తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నిడిగొండ మైనర్‌బాబుతో పాటు తదితరులు సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గొడవలకు తావివ్వొద్దు

- సీఐ నరేశ్‌కుమార్

భూపాలపల్లి రూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గొడవలకు తావివ్వొద్దని ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా అందరూ సహకరించాలని భూపాలపల్లి సీఐ నరేశ్‌కుమార్, ఎస్సై సాంబమూర్తి అన్నారు. భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు గ్రామంలో పోలీసులు సోమవారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అల్లర్లకు పాల్పడితే బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్డన్ సెర్చ్‌లో భాగంగా గ్రామంలోని గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే ఏలాంటి పత్రాలు లేని ఎనిమిది ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక మరుగుదొడ్ల శుభ్రం



శుభ్రం చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్‌లో సామూహిక మరుగు దొడ్లను శుభ్రం చేశారు. ‘నిర్మించారు వదిలేశారు’ అనే శీర్షికతో సోమవారం ‘సాక్షి’లో ప్రచురించడంతో అధికారులు స్పందించారు. స్వచ్ఛ భారత్ మిషన్ మరుగుదొడ్ల పరిసరాల చుట్టు ఉన్న చెత్త చెదారంతో పాటు పొదలు తొలగించారు. అక్కడ ఏర్పాటు చేసిన కుండీలో నీటిని నింపారు.

బస్టాండ్‌ను ప్రారంభించాలి

చిట్యాల: మండల కేంద్రంలో నిర్మించిన నూతన బస్టాండ్‌ను ప్రారంభించాలని ఏబీవీపీ ప్రాంత హాస్టల్స్ కన్వీనర్ వెల్పుల రాజ్‌కుమార్ కోరారు. సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లక్రితమే పనులు పూర్తి చేసినప్పటికీ ఇంత వరకు పాలకులు ప్రారంభించకపోవడం ఏంటనీ ప్రశ్నించారు. బస్టాండ్ అందుబాటులో ఉంటే విద్యార్థులకు, వ్యాపారస్తులకు మేలు కలుగుతుందని అన్నారు. ఒకవేళ స్థానిక ఎమ్మెల్యే బస్టాండ్‌ను ప్రారంభించకపోతే విద్యార్థులతో కలిసి ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రారంభిస్తామని అన్నారు. అజయ్, శేషివర్ధన్, సాయి చరణ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా రోడ్డు



నీరు నిలిచి బురదమయంగా ఉన్న రోడ్డు

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడంలో రోడ్డు వర్షాలకు బురదమయంగా మారింది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షకాలం ప్రారంభం నుంచి ఈ రోడ్డు ఇలానే ఉంటుందని రోడ్డుపై నీరు నిలిచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో డ్రెయినేజీలు లేకపోడంతో నీరు రోడ్డుపైనే నిలుస్తుందని తెలుపుతున్నారు. డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని, రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా చూడాలని అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డుపై నీరు నిల్వకుండా చూడాలని కోరుతున్నారు.

మిగిలిన హామీలను నెరవేర్చడమే లక్ష్యం

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘు

ఏటూరునాగారం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో మిగిలిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా పెట్టుకుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం కార్యకర్తలు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలరాజు, మధుబాబు, ఎల్లయ్య, శ్రీనివాస్, నవీన్, చేల వినయ్, రాంబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రఘు

స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి

- పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కీర్తిరెడ్డి

రేగొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటి ప్రతీ గ్రామంలో కాషాయ జెండా ఎగరేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కీర్తిరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల అభివృద్ధి కేంద్ర నిధులతోనే సాధ్యమవుతుందనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. బీఆర్‌ఎస్ నుంచి పలువురు బీజేపీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్ రెడ్డి, నాయకులు విష్ణు యాదవ్, ప్రసాదరావు, తిరుపతి రావు, మల్లేశ్, పెండ్యాల రాజు, విమల, తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల: మాట్లాడుతున్న కీర్తిరెడ్డి

చిట్యాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ జిల్లా, మండల అధ్యక్షులు ఏడునూతుల నిశీధర్‌రెడ్డి, బుర్ర వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటి జెండా ఎగరవేయాలన్నారు. అందుకు ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని సూచించారు. పార్లమెంట్ కో కన్వీనర్ లింగంపెల్లి ప్రసాద్‌రావు, తీగల జగ్గయ్య, గాలీఫ్, శ్రీనివాస్‌గౌడ్, మైదం శ్రీకాంత్, రావుల రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

టేకుమట్ల: మండలంలోని వెలిశాల శ్రీ చెన్నకేశవ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలను ఆలయ అర్చకుడు వడ్లూరి బ్రహ్మం నిర్వహించారు. దేవి నవరాత్రోత్సవాల సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజల సమయంలో మహిళా భక్తులు అందించిన పసుపు, కుంకుమ, చీరలు, గాజులను ప్రత్యేక పూజల అనంతరం అర్చకుడి చేతుల మీదుగా మహిళలు తీసుకున్నారు. అనంతరం ఆలయంలో దేవి నవరాత్రోత్సవాలను విజయవంతంగా నిర్వహించిన అర్చకుడి దంపతులను భక్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



రేగొండ: బాకీ కార్డులను పంచుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



చిట్యాల: ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



మొగుళ్లపల్లిలో..

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు వేశాలపల్లి, భూపాలపల్లి మండలం కొంపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రధాన ప్రతిపక్ష పార్టీగా హామీలు అమలు చేసేవరకు ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువస్తామన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే విధంగా ఉండటం కోసం కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఓట్ల రూపంలో ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.


ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

రేగొండ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ప్రభుత్వం చేసిన మోసాలపై బీఆర్‌ఎస్ పార్టీ తీసుకొచ్చిన కాంగ్రెస్ బాకీ కార్డులను కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో ఇంటింటికీ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారం కోసం అడ్డగోలు హామీలిచ్చి అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. హమీద్, శంకర్, తిరుపతి, చేరాలు, తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చి నేడు హామీలను అమలు పర్చడం లేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బలుగూరి తిరుపతిరావు, మాజీ జెడ్పీటీసీ జోరుక సదయ్య, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొడాలి రమేశ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బాకీ కార్డులను పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

చిట్యాల: గత ఎన్నికలలో ఆరు గ్యారంటీలు అని లేనిపోని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లం రవీందర్ అన్నారు. సోమవారం మండలంలోని అందుకుతండా, వెంచరామి గ్రామాల్లో కాంగ్రెస్ బాకీ కార్డుతో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. రవీందర్‌రావు, యూత్ అధ్యక్షుడు తౌటం నవీన్, నాయకులు కాసు కుమార్, పల్లె శశిధర్‌రెడ్డి, భూక్యా మోహన్, కాసు సరేష్, సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

‘మూఢ’ బజార్లు!



రేగొండ: చంద్రమండలం పైకి రాకపోకలు సాగిస్తున్న ఈ రోజుల్లోనూ మూడు బజార్ల వద్ద భయానక పరిస్థితి నెలకొంటోంది. దృష్టశక్తుల పేరిట నైవేద్యాలు సమర్పించడం భయాందోళనకు గురి చేస్తోంది. ఇంట్లో ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతుంటే చాలు ఏ దృష్ట శక్తో పట్టి పీడిస్తుందని, వాటికి నైవేద్యం సమర్పిస్తే నయమవుతుందనే మూఢ నమ్మకాలతో ఆయా ప్రధాన చౌరస్తాల్లో విస్తరాకుల్లో నిమ్మకాయలు, కోడిగుడ్లు, కొబ్బరి కాయలు, గారెలు, తదితర పిండి వంటకాలు, మద్యం ఉంచుతున్నారు. పల్లె, పట్టణం అని తేడా లేకుండా ఈ తతంగం నడుస్తోంది. రాత్రిళ్లు బయటకు వెళ్తున్న వాళ్లు చూసి భయాందోళనకు గురవుతున్నారు. ఆదివారం, అమావాస్య రోజులలో మరీ ఎక్కువగా ఉంటున్నాయి.

మల్చింగ్ పద్ధతిలో సాగు

- ఆసక్తి చూపుతున్న మిర్చి రైతులు
- కలుపు మొక్కలకు కళ్లెం
- తగ్గనున్న పురుగుల మందుల వాడకం

మల్హర్: మల్చింగ్ పద్ధతిలో మిర్చి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. గ్రామాల్లో ప్రస్తుతం మిర్చి సాగు పనులు జోరందుకున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండుకుండలా మారడంతోపాటు వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. దీంతో కొందరు రైతులు సాధారణ పద్ధతిలో మిర్చి సాగు చేస్తుండగా.. ఎక్కువ మంది రైతులు మల్చింగ్ పద్ధతిలో మిర్చి సాగు చేస్తూ అధిక లాభాలు గడిస్తున్నారు. చీడపీడల నివారణ, కలుపు, పురుగుల మందుల వాడకాన్ని తగ్గించేందుకు ఎక్కువగా రైతులు మల్చింగ్ పద్ధతిని పాటిస్తున్నారు. ముఖ్యంగా మండలంలోని పెద్దతూండ్ల, గాదంపల్లి, తాడిచర్ల, చిన్నతూండ్ల, అన్సాన్‌పల్లి గ్రామాల్లో మల్చింగ్ పద్ధతిని అవలంబిస్తూ రైతులు ఉత్సాహంగా మిర్చి పంట సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 2300 ఎకరాల మేర మిర్చి సాగు అవుతున్నట్లు వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. వీటిలో 70 శాతం పైగా మల్చింగ్ సాగు పై రైతులు దష్టి పెడుతున్నట్లు చెబుతున్నారు.

మల్చింగ్‌తో ఉపయోగాలు

మొక్క చుట్టూ భూమిలో ఉండే తేమ ఆవిరి కాకుండా నివారించడం వల్ల వివిధ కాలపరిమితులు గల పంటలకు 30–40 శాతం వరకు నీరు ఆదా అవుతుంది. ఇంకా దీనిని బిందు సేద్యం పద్ధతిలో కలిపి వాడితే అదనంగా 20శాతం నీరు ఆదా అవుతుంది. సూర్యరశ్మి నేరుగా కలుపు మొక్కలకు సోకకుండా చేయడం వల్ల కిరణజన్య సంయోగక్రియ జరగక సుమారు 85 శాతం వరకు కలుపును నివారించవచ్చు. మొక్కలకు వాటి జీవితకాలమంతా అనుకూల సూక్ష్మ వాతావరణ పరిస్థితులు ఏర్పడి ఏపుగా పెరిగి మంచి నాణ్యతతో (20–50శాతం) అధిక దిగుబడులు పొందవచ్చు. భూమిలో ఎల్లప్పుడూ తేమ నిల్వ ఉండడం వల్ల నేల గుల్లబారి వేరు వ్యవస్థ బాగా వృద్ధి చెందుతుంది. దీనివల్ల నీరు, ఎరువులు భూమి లోపల పొరల్లో నుంచి కూడా మొక్కలకు అధికంగా లభ్యమవుతుంది.



పెద్దతూండ్లలో మల్చింగ్ విధానంతో సాగు చేస్తున్న మిర్చి

సాగు చేసే విధానం

మొక్కలకు ఇరువైపులా లేదా చుట్టూరా 5 సెం.మీ. నుంచి 10 సెం.మీ. లోతు గాడి చేయాలి. మల్చింగ్ షీట్‌ను కావాల్సిన సైజులో కత్తిరించుకోవాలి. ఈ షీటును ప్రతీ వరుసలో లేదా చెట్టు దగ్గర వదులుగా లేదా బిగుతుగా లేకుండా కప్పి అన్ని చివరలకు గాడిలో పోయేలా చేసి మట్టితో కప్పాలి. ఈ ప్రక్రియను యాంకరింగ్ అని అంటారు. దీనివల్ల మాల్చింగ్ షీటు గాలికి చెదిరిపోకుండా ఉంటుంది.

జాగ్రత్తలు..

మల్చింగ్ షీటును బలంగా లాగకూడదు. సాయంత్రం వేళల్లో మాత్రమే షీట్లను అమర్చాలి. ఎందుకుంటే దీనికి సాగే గుణం ఉంటుంది. ఎక్కువ గాలి ఉన్నప్పుడు కూడా మల్చింగ్ వేయరాదు. పంటకాలం తర్వాత మల్చింగ్ షీటును పొలం నుంచి తీసివేసి పనులు చేసుకోవాలి. 7.25 మైక్రాన్ల మందం కలిగిన షీట్లు ఒక పంటకాలానికి, 50–200 మైక్రాన్ల మందం కలిగిన షీట్లు 3 సంవత్సరాల వరకు మన్నిక కలిగి ఉంటాయి.

తక్కువ ఖర్చుతో అధిక లాభాలు



మల్చింగ్ విధానంతో ఏడు ఎకరాల్లో మిర్చి సాగు చేశా. ఈ విధానం ద్వారా కలుపు తక్కువగా ఉంటుంది. ఎరువుల వాడకం కూడా తగ్గుతుంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసుకోవచ్చు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చు.

– శ్రీధర్ పెద్దతూండ్ల, మల్హర్